**కామెడీ కథ**

**ఆ ఆదివారం సూర్యోదయంతోబాటు తిరుమలరావుకి జ్ఞానోదయం కూడా అయింది. నిద్ర పక్క మీద నుంచి లేచినది మొదలుకుని నిద్రపోయేవరకు ఆడవాళ్ళు గడియారం ముల్లుతో పోటీపడి ఎంత పనిచేస్తారో ఆ రోజే తెలుసుకున్నాడు. తనకంటే ముందు లేచిన భార్య, అప్పటికే బట్టలుతకడం పూర్తి చేసి పవర్‌కట్ వలన మిక్సీ వున్నా అది పని చెయ్యదు కాబట్టి పెరట్లో వున్న రోట్లో పెసరట్ల పిండి రుబ్బుతుంటే బాధగా చూసాడు.**

# ఒకే ఒక్కరోజు



తీగెలమీద ఆరేసివున్న బట్టలని, చెమటలు దిగ్గారుతూ నానేసిన పెసలని పిండిగా మార్చే ప్రయత్నంలో రుబ్బురోలుతో కుస్తీపడుతున్న భార్యని చూసి ప్రేమగా అన్నాడు.

''ఎంత కష్టపడుతున్నావ్ అలివేలూ! మిక్సీ పనిచెయ్యకపోతే ఇప్పుడు పెసరట్లు ఎందుకు మొదలుపెట్టావు? ఏ ఉప్మానో చెయ్యలేకపోయావా?''

అలివేలు క్షణకాలం పొత్రం తిప్పడం ఆపి, మొగుడిని చూసి నవ్వి అంది.

''గౌతమబుద్ధుడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయమైనట్టు మీకు, మామిడి చెట్టు కింద జ్ఞానోదయమయిందా? నేను కష్టపడుతున్నానని ఇన్నాళ్ళకి గ్రహించినందుకు చాలా సంతోషం.

ఆ స్వరంలోని వ్యంగ్యానికి తిరుమలరావుకి ఏమాత్రం కోపం రాలేదు.

''నేను రుబ్బి పెట్టనా?''

''నిజంగా మీరు మీరేనా? ఇవాళ నాకు సాయం చెయ్యాలని బుద్ధి పుట్టిందేమిటి?''

''ఇవాళ ఆదివారం. నేను ఖాళీయే కద, నీకు సాయం చేద్దామని''

''మహారాజులా చెయ్యండి. నేనీలోగా పెసరట్లలోకి కాంబినేషన్ ఉప్మా చేస్తాను'' అని అలివేలు చేతులు కడుక్కుని వంటింట్లోకి వెళ్ళింది. తిరుమలరావు లుంగీ బిగించి రోటిముందు కూర్చున్నాడు.

వేగంగా పొత్రాన్ని తిప్పసాగాడు. పొత్రంతోబాటు తల కూడా గిరగిర తిప్పుతూ పిండి రుబ్బుతున్నాడు. అయిదు నిముషాలు రుబ్బకుండానే అతని చెయ్యి నెప్పి పెట్టడం మొదలెట్టింది. పెళ్ళాన్ని పిలిచి 'ఈ పని నా వల్ల కాదు. నువ్వు రుబ్బుకో' అని చెబుతామనుకున్నాడు కానీ, అహం అడ్డొచ్చింది.

హుస్సురంటూ పిండి రుబ్బడం పూర్తి చేసి పిండి మెత్తగా అయ్యాక గిన్నెలోకి తీసి వంటింట్లోకి పట్టికెళ్ళాడు. ఉప్మా మూకుడు దించుతున్న అలివేలు దర్పంగా ''థాంక్ యూ!'' అంది.

అయిదు నిముషాల తర్వాత వేడి వేడి పెసరట్టుతో ఉప్మానంజుకుని లాగిస్తున్నప్పుడు తిరుమలరావుకి భార్యపై జాలి రెట్టింపయింది.

'పాపం! ఎంత కష్టపడుతుంది! ఒక్కొక్క పెసరట్టుని దోరగా కాల్చి ఇంతమందికి పెట్టడమంటే మాటలా? మళ్ళీ వంట చెయ్యాలి. అదయ్యాక ఆరిన బట్టలని ఇస్త్రీ చెయ్యాలి. మధ్యలో పిల్లలకి తలంటిపొయ్యాలి. ఆదివారం కదా అని ఇంటికి వచ్చే స్నేహితులకి కాఫీ, టీ లాంటి మర్యాదలు. మళ్ళీ రాత్రికి వంట. ఇల్లాలు చేసే చాకిరీకి ఎవరు విలువ కట్టగలరు' అతని మనసులోని ఈ ఆలోచన ఒక కొత్త అయిడియాకి రూపకల్పన చేసింది.

ఆదివారం కాబట్టి స్పెషల్ వంటకాలతో సుష్టుగా తిని పేకాట ఆడడానికి పదిహేను మందిదాకా ఆ కాలనీవాసులు తిరుమలరావు ఇంటికి చేరారు.

''లైఫ్ బొత్తిగా రొటీన్ అయి బోర్ కొడుతోంది. అందుకని పిల్లలకి వేసవి సెలవులివ్వగానే పదిరోజులు సెలవు పెట్టి ఫ్యామిలీతో మైసూరు వెళ్దామనుకుంటున్నాను'' అన్నాడు సుందరం.

'' మా ఆవిడా తెగ గోల చేస్తోంది రోజా వంట వండడం బట్టలుతకడమేనా జీవితం అంటే? అని. పిల్లలసలే గొడవ ఎక్కడికైనా తీసుకెళ్ళమని కాని, ఇల్లు కదలాలంటే డబ్బు కావాలి. అందుకని ఆలోచిస్తున్నాను'' అన్నాడు చక్రపాణి.

''ఎవరికైనా సెలవు వుంటుంది కాని, ఇల్లాలికి మాత్రం సెలవు వుండదు. ఆమెకి బోర్ కొట్టదూ మరి. పిల్లలకి భర్తకి సెలవు వచ్చిన రోజు ఆమెకి మరికాస్త పనెక్కువవుతుంది. అందుకే ఆడవాళ్ళు రొటీన్ నుంచి బయటపడడానికి, మనం అంటే మగవాళ్ళకి స్త్రీ కష్టాలు తెలియడానికి నేనొక వెరైటీ ప్రోగ్రామ్ ఆలోచించాను'' గొంతు సర్దుకుని ఉపన్యాసంలా మొదలుపెట్టాడు.

''ఉదయం అయిదు గంటలకి నిద్ర లేచినది మొదలుకుని రాత్రి పది గంటలవరకు ఆడవాళ్ళు రకరకాల పనులతో సతమతమవుతూ వుంటారు. కాని మనం? ఆఫీసుకుకి వెళ్ళి వచ్చి అలసిపోయామనే వంకతో ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టం. పైగా వాళ్ళు ఎంతో కష్టపడి వండిన వంట తిని రకరకాల వంకలు పెడతాం. వాళ్ళెప్పుడైనా పది రూపాయలు అనవసరంగా ఖర్చుపెడితే సంపాదించి చూడు ఎంత కష్టమో తెలుస్తుంది అనే మనం ఒక్కరోజు ఒకే ఒక్కరోజు ఆవిడ చేసే ఇంటి పనులన్నీ కాకపోయినా కనీసం వంట కూడా వండలేము. అందుకని ఆదివారం మనకి సెలవు కాబట్టి ఆ ఆదివారం ఆడవాళ్ళకి సెలవు ఇద్దాం''

''అంటే? ఆరోజు బట్టలుతికి, ఇల్లు క్లీన్ చేసి వంట మనం వండాలా?'' గిరి అడిగాడు.

''అన్ని పనులూ అక్కర్లేదు. వంటొక్కటీ చాలు. ఉదయం బ్రేక్ ఫాస్టు నుంచి రాత్రి వంట దాకా మనమే చెయ్యాలి. ఆరోజు ఆడవాళ్ళు మార్నింగ్ షోకి వెళ్ళవచ్చు. స్నేహితుల ఇళ్ళకి వెళ్ళవచ్చు. ఆ ఒక్కరోజూ వాళ్ళిష్టం.''

''అమ్మో! వంటయితే ఎలాగో చెయ్యవచ్చు కానీ బ్రేక్‌ఫాస్టు అంటే కష్టం. మా గడుగ్గాయిలు చపాతీ కూర, పూరీ కూర ఇలాంటివి అడుగుతారు. అన్నీ వత్తేప్పటికి నా చేతులు పట్టేస్తాయి'' మోహనరావు అన్నాడు.


''అవును. బ్రేక్ ఫాస్టు అంటే కష్టం'' అనేక స్వరాలు కోరస్‌గా పలికాయి.

''ఒ.కె. ఆరోజుకి బ్రేక్‌ఫాస్టు హోటల్ నుంచి తెచ్చుకోవచ్చు. వంట మాత్రం మనమే వండాలి. ఎవరింట్లో వాళ్ళు తినడం కాకుండా భోజనాల సమయంలో ఒకచోట చేరి ఎవరు వండిన వంటని వాళ్ళు అందరికీ రుచి చూపించాలి''

''నాకసలు బియ్యంలో ఎన్ని నీళ్ళు పొయ్యాలో కూడా తెలియదే!'' చక్రపాణి అన్నాడు.

''వంటరాని వాళ్ళు కావాలంటే భార్య సలహా తీసుకోవచ్చు. వంటలు-పిండివంటలు లాంటి పుస్తకాలని దగ్గరుంచుకుని వాటిని ఫాలో అవచ్చు. ఇంత కష్టపడి మనం వండిన వంటకి మన కష్టానికి తగిన ప్రతిఫలం వుంటుంది.

ఫస్ట్ బెస్ట్ వంటకి ప్రెషర్‌ప్యాన్
సెకండ్ బెస్ట్ వంటకి నాన్‌స్టిక్ దోశ ప్యాన్
థర్డ్ బెస్ట్ వంటకానికి ఒక హాట్ ప్యాక్
అలాగే చెత్త, పరమచెత్త, దరిద్రపు వంటకాలకీ



ఈక్వల్ ప్రైజులు ఇవ్వబడతాయి. ఈ ప్రపోజల్ నాది కాబట్టి వాటికయ్యే ఖర్చు నేనే భరిస్తాను. మన వంటలలో ఏది బెస్టో, ఏది వరస్టో జడ్జ్ చెయ్యడానికి 'ఆంటీ మెస్' ప్రొప్రయిటర్ సుబ్బమ్మగారిని పిలుద్దాం.''

నలభీమ పాకాన్ని మరిపించేలా వంట చెయ్యగల భీమారావు చిద్విలాసంగా నవ్వేడు. ''నా పేరే భీమారావు. నేను రెడీ'' అన్నాడు.

''సరే గురూ! నీ అయిడియా బాగుంది'' కాస్తో కూస్తో వంట వచ్చిన పదిమంది మగవాళ్ళు అన్నారు. మిగిలిన అయిదారుగురూ పాపుల కంటికి దేవతా వస్త్రాలు కనబడవనగానే, తామూ పుణ్యాత్ములమేనని, తమ కంటికీ రాజుగారు ధరిచిన దేవతా వస్త్రాలు కనిపిస్తున్నాయనే అమాయకుల్లాగా గుంపులో గోవిందాలాగా 'ఒ.కె.' అన్నారు.

వెంటనే అక్కడ సమావేశమైన మగవాళ్ళ భార్యలందరినీ పిలిచాడు తిరుమలరావు. తనకి వచ్చిన ఆ అయిడియాని అతను చెప్పగానే హర్షాతిరేకంతో ఆడవాళ్ళందరూ కరతాళ ధ్వనులు చేసారు.

''మీ ప్లాన్ అమలులోకి వచ్చేదెప్పుడు? మేము సుఖపడేదెప్పుడు?'' చక్రపాణి భార్య కృష్ణవేణి, ''ఇదంతా నిజంగా జరిగేదేనా?'' అనే లెవెల్‌లో అడిగింది.

''ఎప్పుడో ఏమిటి? వచ్చే ఆదివారమే'' అన్నాడు.

★ ★ ★

''కంగ్రాచ్యులేషన్స్ అలివేలుగారూ!'' అనేక స్వరాలు కోరస్‌గా పలికాయి. ఒకరి తర్వాత ఒకరుగా ఆమె చేతిని నొక్కి వదులుతున్నారు.

ఉక్కిరిబిక్కిరయిన అలివేలు అడిగింది. ''ఎందుకు? ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ వున్నట్టే తిరుమలరావుగారికి వచ్చిన ఈ మహత్తరమైన అయిడియా వెనుక మీరు వుండే వుంటారని నా నమ్మకం '' కృష్ణవేణి అంది.

''థాంక్స్! ఆ అయిడియా ఆయనదేకాని, అందుకు స్ఫూర్తి నేనేలెండి'' చిరుగర్వంగా అంది.

''మగవాళ్ళ తిక్క కుదిర్చే ఉపాయాన్ని మగవాడై వుండీ కనిపెట్టిన మీవారిని మెచ్చుకోవాలి. లేకపోతే వంట రాదుగాని, వండిన వంటకి వంకలు పెట్టడం మాత్రం వచ్చు మా ఆయనకి.'' గిరి భార్య సుశీల అంది.

''బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి చాలా రోజులయిందిగా? ఆదివారం వెళ్దాం. మోహన్ భార్య సుమిత్ర అంది.

**హోతా పద్మినీదేవి**

''సరే!'' అంది అలివేలు.

అందరూ ఆ ఆదివారం కోసం ఎగ్జయిటింగ్‌గా ఎదురు చూడసాగారు.

★ ★ ★

ఆదివారం. ఏడుగంటలు కావస్తున్నా గురక పెడుతూ పడుకున్న భర్తని లేపింది అలివేలు.

''ఇవాళ ఆదివారం కదోయ్! కాస్సేపు పడుకుంటాను''

''ఆదివారం కనుకనే లేవమంటున్నాను. ఇవాళ నాకు హాలిడే మరచిపోయారా?''

చల్లటినీళ్ళు ముఖాన కొట్టినట్టు మత్తు వదిలిపోయి లేచి, త్వరగా తయారయ్యాడు.

''బ్రేక్‌ఫాస్టు ఇంట్లో చెయ్యలేమని, హోటల్ నుంచి తెస్తామని అన్నారుగా? తెస్తే తిని నేను బయటికి వెళ్తాను''

''ఓ యస్! పది నిముషాలలో తెస్తాను. ఎవరికేం కావాలో చెప్పండి'' అన్నాడు వంటింట్లో మేకుకి వున్న వైరు బుట్టని అందుకుంటూ.

''నాకు దోశ'' హోమ్ వర్కు చేస్తున్న బుజ్జి.

''నాకు పూరీ'' లెక్కలు చేసుకుంటున్న పాప.

''నాకు మసాలా దోశ'' అంది అలివేలు.

''కనీసం ఇవాళ ఈ విషయంలోనైనా ఐకమత్యం, సంఘీభావం పాటించి అందరూ ఇడ్లీ

అడగవచ్చుగా? ఒక్కొక్కళ్ళకి ఒక్కో వెరయిటీ హోటల్ వాడు చేసి ఇచ్చేప్పటికి అరగంటయినా పడుతుంది. అప్పుడు ఇంటికొచ్చి వంట చెయ్యాలి- అనుకుని ఆ అయిడియా ఇచ్చినది నేనే కాబట్టి చేసేదేంలేక స్కూటర్‌పై బయలుదేరాడు.

టిఫిన్ తిని, అలివేలు బ్యాగ్ తీసుకుని బయలుదేరింది. ''నేను ఒంటిగంటకల్లా వస్తాను. అప్పటికి మీ వంట పూర్తవుతుందేమో!'' అంది నవ్వుతూ.

## రీమా ఆశలు

**'చిత్రం', 'మనసంతానువ్వే' చిత్రాలతో టీనేజ్ యువతని ఒక్క ఊపు ఊపిన రీమాసేన్ చాలా గ్యాప్ తరువాత ఆనందంగా కనిపిస్తోంది. ఈమధ్యకాలంలో ఆమె నటించిన తమిళచిత్రాలు తెలుగు నిర్మాతల్ని ఆకర్షించి మళ్లీ తెలుగులో మళ్లీ అవకాశాలకు దోహదపడ్డాయి. శశికాంత్ హీరోగా కె.అజయ్ నిర్మిస్తున్న సినిమా షూటింగ్‌లో ఆమె ఇప్పుడు బిజీగా ఉంది. 'ఆఫర్లు ఎన్ని వచ్చినా నా పద్ధతిని నేను మార్చుకోలేను. నేను నటించే ప్రతి సినిమాని సక్సెస్ చేయాలనుకుంటాను. ఒక సినిమా పూర్తయ్యేవరకూ మరో సినిమాలో నటించాలని నేననుకోవడంలేదు' అని చెప్పే రీమాకి ఎన్నో ఆశలున్నాయి. 'చిరంజీవి, మహేష్‌బాబు, జూనియర్ ఎన్‌టిఆర్ సినిమాల్లో నటించాలని ఉంది. ఆ కోరిక త్వరలో నెరవేరుతుందని ఆశిస్తున్నాను.**

ఒక్కరోజు వంట చెయ్యాలంటే తనింత బెంగ పెట్టుకున్నాడేమిటి? అలివేలయితే ఈపాటికి బట్టలుతికి స్పెషల్స్‌తోసహా వంట చేసి పిల్లలకి తలంటు కూడా పోసేది అనుకున్నాడు. చదువుకుంటున్న పిల్లల పక్కనే కూర్చుని, వంటలు-పిండివంటలు పుస్తకాన్ని తెరిచాడు.


అదే సమయానికి భీమారావు ''ఆహా ఏమి రుచి! అనరా మైమరచి'' అని పాడుకుంటూ గుత్తొంకాయ కూరని స్టవ్ మీద పెట్టి ''కోరి భుజింతును గోంగూర పచ్చడి'' అని పాడుతూ గోంగూర పచ్చడిని, రుబ్బుతున్నాడు.

మోహన్‌కి గోవర్ధనానికి కాస్తోకూస్తో వంట వచ్చు. కానీ ఇవాళ ఉత్తమ వంటకం బహుమతిని సంపాదించాలంటే ఆ వంట చాలదు. ఏదైనా స్పెషల్‌గా వండాలని వారం క్రిందటే ఆలోచించి పెట్టుకున్న వంటలని ఫలానా పుస్తకంలో చెప్పిన విధంగా వండాలని ఆ పుస్తకాన్ని దగ్గర పెట్టుకుని మరీ వండుతున్నారు. ఎవరికి వారే ఆ ప్రయిజు తమకే రావాలని పట్టుదలతో, శ్రద్ధతో, అంకితభావంతో వండుతున్నారు.

చక్రపాణి పెళ్ళాన్ని మార్నింగ్ షోకి పంపి తలుపు వేసుకుని బియ్యం కడిగి ఎసర్లో వేసాడు. ఉల్లిపాయలని తరగడం మొదలుపెట్టాడు. కాయగూరలన్నీ తరిగాక చెత్తని పాలిథిన్ బ్యాగ్‌లో వేసి వీధి చివర చెత్తకుండీలో వేసాడు. అప్పుడే చెత్త పారబోయడానికి వచ్చిన గిరి నవ్వుతూ అడిగేడు.

''వంటయిందా?''

''లేదు. మొదలుపెట్టాలి ఒంటిగంటదాకా మా ఆవిడ ఇంటికి రాదుగా నీ వంటయిందా?''



''నాదీ డిటోనే'' క్షణం ఆగి అన్నాడు. ''కర్మ! ఆడ శరీరాల్లోకి పరకాయ ప్రవేశం చేసినట్టు మనకి ఆడవాళ్ళ మాటలే వస్తున్నాయి. ఇదంతా ఆ తిరుమలరావు చేసిన పని. ఏదో ప్రయిజు తెచ్చుకోవాలని నలుగురిలో తలవంపులు తెచ్చుకోకుండా వుండాలనే తపనతో అలవాటు లేని అంట తొప్పలాతో కుస్తీ పట్టవలసి వస్తోంది. వీడికి పెళ్ళాం మీద జాలి వుంటే రోజూ వంట చెయ్యమను. బట్టలుతకమను. కావాలంటే కాళ్ళుపట్టమను. మొత్తం ఆడజాతిమీదే జాలి కలిగినట్టు వెధవ బిల్డప్ వీడూనూ!'' అక్కసుగా అన్నాడు.

''మరే! రోజురోజుకీ వీడికి పోజెక్కువయిపోతోంది!'' తిరుమలరావుని కసితీరా తిట్టుకుని, ఇద్దరూ ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు. అయిదు నిముషాల తర్వాత కళ్ళు మాత్రం కనిపించేలా పూర్తి, బురఖావేసుకున్న ఒక ముస్లిం యువతి ఆ వీధి మలుపు తిరుగుతూ అలాంటిదే బురఖా ధరించి తనకెదురైన మరో ముస్లిం యువతిని 'ఎవరా?' అని ఆసక్తితో చూసింది.

ఒంటిగంట దాటుతుండగా బయటికెళ్ళిన ఆడవాళ్ళు ఇల్లు చేరారు. పిల్లలు ఆకలని గొడవ చేస్తున్నారు. ముందే అనుకున్న ప్రకారం అందరూ తిరుమలరావు ఇల్లు పెద్దది కావడం వలన తాము వండిన వంటకాలతో సహా అక్కడకి చేరారు.

''లేడీస్ ఫస్ట్! కాబట్టి ముందు మీరు కూర్చోండి, మేము వడ్డిస్తాం'' అన్నారు మగవాళ్ళు. ''ముందు మీరు తినండి. తిన్నాక మీకు బాగుంటే ఆనక మేము తింటాం'' అని ఆడవాళ్ళు వేళాకోళం చేసారు. చివరికి అందరూ ఒకేసారి తినవచ్చని బఫే తీసుకుందామని నిర్ణయించుకున్నారు.

మగవాళ్ళందరి గుండెలూ వేగంగా కొట్టుకుంటున్నాయి. ఎవరికివాళ్ళు తమ వంట ఎవరికీ నచ్చదేమో, తమకి ప్రైజు రాదేమో అని యమటెన్షన్‌గా వున్నారు. భీమారావు ఒక్కడే ధైర్యంగా వున్నాడు. తన వంట మీద తనకి అపారమైన నమ్మకం.

''భీమారావుగారిది నిజంగా నలభీమపాకమే'' గుత్తొంకాయ కూరని ముందుగా రుచి చూసిన అలివేలు అంది.

''విశాలగారు అదృష్టవంతురాలు!''

''ఐ అప్రీషియేట్ యు భీమారావ్!'' ప్రశంసల జల్లులు, పొగడ్తలు! భీమారావు ఉబ్బిపోయాడు.

''వావ్! వెరీ డెలిషియస్!''

''కుర్మా అదిరింది!''

''అచ్చం హోటల్‌లో చేసినట్టుంది!''

''పలావ్ చాలా బాగుంది''

''సుపర్బ్!''

''జిహ్వ లేచొచ్చింది!''

చక్రపాణి, గిరిల ముఖాలు చింకి చేటంత య్యాయి. భోజనాలు ముగిసాయి. ముఖంలో ఏ భావం వ్యక్తం కాకుండా మౌనంగా భోజనం చేసిన 'ఆంటీ మెస్' ప్రొప్రయిటర్ సుబ్బమ్మగారు లేచి నిలబడ్డారు. ఫస్ట్ ప్రయిజు ఎవరికి వస్తుందోనని అందరూ వారి భార్యలతో సహా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

''ఫస్ట్‌బెస్ట్ వంటకం పులావ్! గిరిగారు'' ఆవిడ అనౌన్స్ చేసింది.

హర్షధ్వానాలు మార్మోగాయి. గిరి సగర్వంగా ప్రయిజు అందుకుంటూంటే భీమారావు ముఖం వాడిపోయింది. బలవంతాన తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అందరితోబాటు చప్పట్లు కొడుతూ మనసులో అనుకున్నాడు. 'సెకండ్ ప్రయిజు కచ్చితంగా మనదే!'

''సెకండ్ బెస్ట్ కుర్మా! చక్రపాణిగారు''

భీమారావు ముఖం మరింత నల్లబడింది.

''థర్డ్ బెస్ట్ గుత్తొంకాయ కూర, గోంగూరపచ్చడి సంయుక్తంగా ప్రకటించిన ప్రైజుని భీమారావు గారు అందుకుంటారు''

భీమారావు ముఖాన నవ్వు పులుముకుని వెళ్ళి ప్రైజుని అందుకున్నాడు.

''ఫస్ట్ ప్రైజు కొట్టేసిన గిరిగారి మిసెస్ సుశీలగారి చేతుల మీద ఇప్పుడు చెత్త, పరమచెత్త దరిద్రపు వంటకాలకి బహుమతులు అందచెయ్యబడతాయి''

సుశీల గర్వంగా లేచి నిలబడింది.

''చెత్తవంటకం క్యాబేజీ వడ- తిరుమలరావు గారు'' అనౌన్స్ చేసింది సుబ్బమ్మగారు.

అందరూ గొల్లున నవ్వుతూ చప్పట్లు కొడుతుంటే తిరుమలరావు స్పోర్టివ్‌గా నవ్వుతూ వెళ్ళి బహుమతిని అందుకున్నాడు.

''పరమచెత్త వంటకం పనసపొట్టుకూర మోహన్రావుగారు''.

మోహన్రావు భార్య సుమిత్ర ఎగతాళిగా మొగుడిని చూస్తుంటే అతను వెళ్ళి బహుమతిని అందుకున్నాడు.

''దరిద్రపు వంటకం సాంబారు. గోవర్ధన్‌గారు'' మరోసారి గొల్లున నవ్వులు, చప్పట్లు.

తిరుమలరావు లేచి అందరినీ నిశ్శబ్దంగా వుండమన్నాడు.

''డియర్ ఫ్రెండ్స్! ఎవరినీ కించపరచడం ఈ పోటీ ఉద్దేశం కాదు. మనం మన భార్యలని తరచు అనే మాట 'చేతనైతే సంపాదించు చూద్దాం' అని. అదే వాళ్ళు మనం వాళ్ళ వంటకి వంకలు పెట్టినప్పుడు 'చేతనైతే నాకంటే బాగా వంట చెయ్యండి చూద్దాం' అనరు. అన్నా మనం పట్టించుకోం. ఒక్కరోజు..ఒకే ఒక్కరోజు మనం వంట చేస్తే మనలో ఎంతమంది చేతులు కాల్చుకున్నారో? ఎన్ని గిన్నెలు మాడిపోయాయో! ఉల్లిపాయలు తరిగేటప్పుడు ఎన్ని కన్నీళ్ళు కార్చారో తెలియదు. అఫ్‌కోర్స్! నలభీమపాకం అనే మాట ఈయన వంట రుచి చూసే పుట్టి వుంటుందనిపించేలా చవులూరించేలా వండే భీమారావుగారి గురించి నేను మాట్లాడడం లేదు. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం అసలు వంటే రాదన్న చక్రపాణి, గిరిగార్లు ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుపొందడం అభినందించదగిన విషయం. ఈ పోటీ వెనుక నిత్యం ఇంటి పనులతో సతమతమయ్యే ఆడవాళ్ళకి ఒక్క రోజయినా సాయం చెయ్యాలనే సత్సంకల్పం వుంది. కాబట్టి ఈ ఒక్కరోజుతో వంటింటికి గుడ్‌బై చెప్పకుండా వీలయినప్పుడల్లా మనమందరం మన భార్యలకి సాయం చెయ్యాలి''

అందరూ ముఖ్యంగా ఆడవాళ్ళు పెద్దపెట్టున కరతాళ ధ్వనులు చేసారు. ఇంటికి వెళ్ళగానే గిరి భార్య సుశీల సీరియస్‌గా మొగుడిని అడిగింది.

''నిజం చెప్పండి. పులావ్ మీరే వండారా?''


''నేనే వండాను''

''అబద్ధం! మీరు వండలేదు''

''కావాలంటే వంటింట్లోకి వెళ్ళి గిన్నెలు చూడు''

''నా మీద ఒట్టేసి చెప్పండి'' చప్పున అతని చేతిని తన తలమీద పెట్టుకుంటూ అడిగింది.

గిరి ముఖం ఎర్రబడగా అన్నాడు. ''నాకు వంట రాదు. చెయ్యడానికి పరమబద్ధకం కూడా. ఎలాగో ఏ వంటల పుస్తకాన్నో ఫాలో అయి వుండినా అది పరమదరిద్రపు వంటకంగా సెలక్టు అవుతుంది. రేపు నేను రోడ్డంట నడుస్తుంటే ఎవరైనా దరిద్రపు వంటకం ప్రయిజు తెచ్చుకున్న వాడు వీడేనని చెప్పుకుని నవ్వుకుంటూంటే నేను భరించలేను అందుకని..''




''ఊ.. అందుకని''

''ఎవరికీ అనుమానం రాకుండా బురఖా వేసుకుని హోటల్‌కి వెళ్ళి పులావ్ కొని తెచ్చాను. ఇంట్లో వున్న జీడిపప్పు అంతా వేయించి, పైన పోసాను''

''కష్టపడి మీరే వండినట్టు బిల్డప్ ఇచ్చి అన్యాయంగా బహుమతి కొట్టేసారు. అసలు మీ బుద్ధే అంత! కాపీ కొట్టి పరీక్ష పాసయ్యారు. లంచం ఇచ్చి ఉద్యోగం సంపాదించారు'' భార్య ఉక్రోషంగా తిడుతుంటే చిద్విలాసంగా నవ్వేడు.

''నువ్వు తొందరగా గిన్నెలు తోమిస్తే రాత్రికి అన్నం వండుతాను. పనిమనిషి ఇవాళ రాలేదు. నిన్నటి గిన్నెలన్నీ అలాగే వున్నాయి. పది రోజుల పాటు అది పనిలోకి రాదుట. కూతురికి పురుడొచ్చింది. రానని కబురు చేసింది''

సుశీలకి నీరసం వచ్చింది. ఆమె పళ్ళు కొరుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది. 'ఇవాళ వంట మాత్రమే చెయ్యమన్నాడు తిరుమలరావు. అంట గిన్నెలు కూడా తోమమనవలసింది. మగవాళ్ళ తిక్క కుదిరేది' అనుకుంటూ.

అదే సమయానికి కృష్ణవేణి, చక్రపాణిని నిలదీస్తోంది. ఆమె ఒట్టు వెయ్యమనకుండానే రహస్యాన్ని విప్పేసాడు.

''బురఖా వేసుకుని హోటల్ నుంచి కొని తెచ్చాను''

''ఇప్పుడే వెళ్ళి అందరికీ ఈ విషయం చెప్పేస్తాను'' బ్లాక్‌మెయిలర్‌లా అంది.

అమాంతం భార్య చేతులని పట్టుకున్నాడు. ''ఇవి చేతులు కావు. కాళ్ళనుకో. నా పరువు పీకి పందిరి వెయ్యకు''

ఆమె కోపంగా చూసింది.

మరునాడు మధ్యాహ్నం లంచ్ అవర్‌లో కేరేజీ విప్పిన చక్రపాణి చలిమిడి ముద్దలా వున్న అన్నాన్ని మాడిపోయి బొగ్గుముక్కలా వున్న అరటికాయ వేపుడిని చూసి అన్నం తినే ప్రయత్నాన్ని విరమించుకుని కోపంగా కేరేజీ మూసేసాడు.

సాయంకాలం ఇంటికి రాగానే అడిగాడు. ''వంట అలా తగలెట్టావేం?''

''రోజూ బాగానే చేస్తున్నానుగా? ఒక్కరోజు వంట పాడుచేస్తే ఎందుకలా అయిపోతున్నారు? నిజమేలెండి. ఏ హోటల్ నుంచో కొని తెచ్చి కేరేజీ సర్ది నేనే చేసానని చెప్పవలసింది'' అంది దెప్పి పొడుపుగా.

ఆమె నోటి వెంట 'హోటల్' అనే మాట వినగానే మరోసారి ఆమె చేతులని పట్టుకున్నాడు చక్రపాణి.

✪